

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నంద్యాలలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ యోగా మాసోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమాల్లో పాల్గొననుండటంతో సోమవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభం కావాల్సిన గ్రీవెన్స్ 10:30గంటలకు ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నెంబర్ 1100కాల్ సెంటర్‌ను సంప్రదించి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.104.77 కోట్లు విడుదల



నంద్యాల టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కింద పని కూలీలకు 104.77 కోట్లు విడుదల చేసినట్లు డ్వామా పీడీ సూర్య నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రూ.5.53 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. మిగిలిన అందరికీ త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు ఏపీవోలు కూడా వారి పరిధిలో పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

బీమా వస్తుందోచ్..!



- పంట బీమా పథకానికి నంద్యాల జిల్లా ఎంపిక
- అరటి, పత్తి, వేరుశనగ పంటలకు బీమా సౌకర్యం
- ఈ ఏడాది ఖరీఫ్‌లో అమలు



నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ద్వారా పంట నష్టం వల్ల కలిగే ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులను ఆదుకునేందుకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఈ ఖరీఫ్‌లో అమలు చేస్తోంది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, అనంతపురం, డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలతో పాటు నంద్యాల జిల్లాను ఈ ఏడాది ఖరీఫ్‌కు ఎంపిక చేసింది.

బీమాకు అర్హులు ఎవరు?

వ్యవసాయ భూమి కలిగిన రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తూనే రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ఈ ఖరీఫ్‌లో కౌలుదారులకు బీమా వర్తించేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలై 1నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు అకాల వర్షాలు, అధిక వర్షపాతం, చీడపీడల వాతావరణం నమోదై పంటలు దెబ్బతిన్నట్లయితే బీమా సొమ్ము చెల్లిస్తారు. 2026 మార్చి నుంచి మే 31వ తేదీ వరకు అధిక ఉష్ణోగ్రతతో దెబ్బతిన్న పంటలకు బీమా వర్తిస్తుంది. అధికంగా గాలులు వీచే ఈఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి 2026 మే 31వ తేదీరకు గాలుల వల్ల దెబ్బతిన్న పంటలకు కూడా బీమా వర్తిస్తుంది. ఈ ఏడాది ఆగస్టు 1వతేదీ నుంచి 2026 ఫిబ్రవరి 28వ తేదీ వరకు గాలిలో తేమ శాతం వల్ల నష్టపోయే పంటలకు కూడా బీమా వర్తించేలా రూపొందించారు



దెబ్బతిన్న అరటి పంట

నష్టపరిహారం అంచనా..

ఈ ఏడాది జూలై 1 నుంచి 2026 మే 31వ తేదీ వరకు సంవత్సర కాలం మధ్య అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ వాతావరణ పరికరాలతో లెక్కించి వచ్చిన తేడా ఆధారంగా నష్టపరిహారం చెల్లిస్తారు.

రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ఇలా..



పత్తికి ఎకరాకు బీమా మొత్తం రూ.40వేలు కల్పించగా రైతు ఎకరాకు రూ.1900లను ప్రీమియంగా చెల్లించాలి. వేరుశనగకు ఎకరాకు బీమా మొత్తం రూ.28వేలు కాగా రైతు ఎకరాకు రూ.560 ప్రీమియంగా చెల్లించాలి. అరటికి ఎకరాకు బీమా మొత్తం రూ.55వేలు కల్పించగా రైతు ఎకరాకు రూ.2750 కట్టాలి. స్థానిక రైతు సేవాకేంద్రంలో కాని, ఉద్యానశాఖ అధికారులకు గాని జులై 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాల్సి వుంది.

కావాల్సిన పత్రాలు

బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం (రైతు సేవాకేంద్రాల్లో గ్రామీణ వ్యవసాయ సహాయకులు కాని, గ్రామీణ ఉద్యాన సహాయకులు కాని ఇచ్చిన పత్రాలు)

మన రైతుల అదృష్టం

నంద్యాల జిల్లా బీమా సౌకర్యానికి ఎంపిక కావడం మన రైతుల అదృష్టం. రైతులు అరటి, పత్తి, వేరుశనగ పంటలకు తప్పకుండా ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందాలి. విపత్కర పరిస్థితుల్లో పంటలు నష్టపోతే బీమా ద్వారా ఊరట కలుగుతుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఉపయోగించుకుంటున్నారని ఆశిస్తున్నాము.

- నాగరాజు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, నంద్యాల

మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

గోస్పాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం, మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం గోస్పాడులో మసీదు భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలను విస్మరించారని, కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమంతోపాటు ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎండీ ఫిరోజ్, ఎన్ఎండి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషికి ఘన స్వాగతం



కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషికి స్వాగతం పలుకుతున్న మంత్రి బీసీ

మంత్రాలయం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన కేంద్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాదజోషికి ఆదివారం రాత్రి తుంగభద్ర రైల్వేస్టేషన్‌లో అధికారులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పద్మనాభతీర్థ గెస్టు హౌస్ వద్ద మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పైబావి అమర్నాథ్ రెడ్డి, జేసీ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, కర్ణాటక మాజీమంత్రి శివన్నగౌడునాయక్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శాలువాలతో పూలమాలలతో సత్కరించారు. రాష్ట్రంలో అమలు పరుస్తున్న కేంద్ర పథకాలపై కొంతసేపు చర్చించారు. కేంద్రమంత్రి సోమవారం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని పీఠాధిపతి ఆశీస్సులు పొందనున్నారు.

చదరంగంలో సత్తా..

- నంద్యాలలో రాష్ట్ర స్థాయి పోటీలు 7

ఒకే ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం

- రూ.65వేలు తల్లి ఖాతాలో జమ 7
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

జలాధివాసంలో సంగమేశ్వరుడు

- క్షేత్రాన్ని ముంచెత్తుతున్న వరద జలాలు
- చివరి రోజు క్షేత్రంలో అంత్యపూజలు



సంగమేశ్వరాలయాన్ని ముంచెత్తిన వరదజలాలు



సంగమేశ్వరాలయ ఆవరణలోకి చేరిన వరదనీరు



ఉత్తర ద్వారం గుండా ఆలయ ప్రాంగంలోకి చేరుతున్న వరద జలాలు

ఆత్మకూరు/కొత్తపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం పెరిగి, బ్యాక్‌వాటర్ ప్రదేశంలో వెలసిన సప్తనదుల సంగమేశ్వర క్షేత్రాన్ని ముంచెత్తింది. ఈక్రమంలోనే ఆదివారం ఉదయం 6.30 గంటల సమయానికి వరదజలాలు గర్భాలయంలోకి ప్రవేశించి వేపదారు శివలింగాన్ని స్పృశించాయి. ఆ తర్వాత నెమ్మదిగా నీటిమట్టం పెరగడంతో గర్భాలయంలోని సంగమేశ్వరుడు పూర్తిగా జలాధివాసమయ్యారు. ఆదివారం సాయంత్రం 6గంటల సమయానికి జూరాల నుంచి 15,808 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 6660 క్యూసెక్కుల చొప్పున మొత్తం 22,468 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైల జలాశయానికి చేరుతోంది. దీంతో డ్యాం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గాను.. 840.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. అలాగే గరిష్ఠ నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను 62.4320 టీఎంసీల నీటినిల్వలు వున్నాయి.



వరదజలాలకు వాయనం సమర్పిస్తున్న అర్చకుడు తెలకపల్లి రఘురామశర్మ

86 రోజులపాటు పూజలందుకున్న సంగమేశ్వరుడు

శ్రీశైలానికి గత ఏడాది జూలై 23వ తేదిన వరద వచ్చిచేరడంతో సంగమేశ్వరుడు జలాధివాసం అయ్యారు. ఆ తర్వాత 242 రోజుల పాటు నదీగర్భంలో ఒదిగిన సంగమేశ్వరుడు ఈ ఏడాది మార్చి 22వ తేదీన పూర్తిగా బయల్పడి తిరిగి పూజలందుకున్నారు. అప్పటి నుంచి 86 రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న సంగమేశ్వరుడు మళ్లీ జలాధివాసమయ్యాడు. కాగా శ్రీశైలం జలాశయం వెనకతట్టు జలాల్లో 1981లో జలాధివాసమైన సంగమేశ్వరుడు సుమారు 22ఏళ్ల పాటు నదీగర్భంలోనే ఉండి ఆ తర్వాత 2003లో తొలిసారిగా నదీజలాల నుంచి బయల్పడ్డాడు. అయితే సంగమేశ్వర క్షేత్ర చరిత్రలో 86రోజుల వ్యవధిలోనే సంగమేశ్వరుడు జలాధివాసం కావడం అదే ప్రథమంగా చెప్పవచ్చు.

చివరి రోజు సంగమేశ్వరుడికి అంత్యపూజలు

సంగమేశ్వర క్షేత్రంలోని లలితా సంగమేశ్వర స్వామి, అమ్మవార్లు జలాధివాసం కానుండటంతో చివరి రోజైన ఆదివారం ఆలయ ప్రధాన పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ అంత్యపూజలు నిర్వహించారు. ముందుగా వేపదారు శివలింగానికి రుద్రాభిషేకం గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. తదుపరి స్వామివారికి జలాధివాస జయ మంగళ హారతిని నివేదించారు. సంగమేశ్వరాలయం జలాధివాసమయ్యే అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

చిరుతల కలకలం

- భయాందోళనలో కోసిగి ప్రజలు
- బంధించే క్రమంలో యువకుడిపై దాడి చేసిన ఓ చిరుత పులి




వంకలో పడుకున్న చిరుత

కోసిగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని పులికనుమ ప్రాజెక్టు సమీపంలోని బసవన్నకొండ దగ్గరలోని ఎర్రవంకలో ఓ చిరుత గాండ్రిస్తూ.. నడవలేని స్థితిలో ఉంది. శబ్దం విన్న రైతులు ముందు ఆ చిరుతని చూసి భయపడి గ్రామంలోకి పరుగులు తీశారు. అయితే సుమారు గంటలు కావస్తున్నా.. చిరుత ఉన్న చోట నుంచి ముందుకు కదలకపోవడంతో ఎస్ఐ హనుమంతరెడ్డికి, అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అక్కడి చేరుకొని అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రజలను వెళ్లిపోవాలని ఆయన హెచ్చరించారు. ఎవరూ కూడా చిరుతను కొట్టకూడదని, దానికి హాని కలిగించకూడదని సూచనలు చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికి 3 గంటల సమయంలో చిరుత కొద్దిగా తేరుకుని హుషారై ముందుకు నడవడం ప్రారంభించింది. దగ్గరలో ఉన్న ప్రజలను చూసి గాండ్రించడంతో ఒక్కసారిగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. చిరుత దగ్గరకు వెళ్లకుండా పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలను ఎస్ఐ, పోలీసు సిబ్బంది అప్రమత్తం చేస్తూ హెచ్చరించి వారిని అక్కడి నుంచి పంపించారు. డీఎఫ్‌వో శ్యామల, డీఎఫ్‌వో ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాసులు, ఆదోని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తేజశ్విని, బీట్ ఆఫీసర్ అనూరాధతో పాటు సిబ్బంది అక్కడ చేరుకున్నారు. అటవీ సిబ్బందితో పాటు యువకులు చిరుతని బంధించే క్రమంలో ఓ యువకుడిపై చిరుత దాడి చేసింది. దీంతో ఆ యువకుడి గాయాలయ్యాయి. చివరకు ఆ చిరుతని బోనులో బంధించి ఆదోనికి తీసుకెళ్లారు. శ్రీశైలం నుంచి వైద్యులు వచ్చిన తర్వాత పరిశీలిస్తారని,

మిగతా 7లో...




చిరుతని బోనులో బంధించిన దృశ్యం



చిరుతను చూడడానికి తరలివచ్చిన ప్రజలు



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్



ప్రమాణస్వీకారం చేస్తున్న నాగేశ్వరరావుయాదవ్

ఘనంగా డీసీఎంఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేసిన నాగేశ్వరరావు యాదవ్
- హాజరైన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరావు యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నంద్యాల టెక్కె మార్కెట్‌యార్డులో ఘనంగా నిర్వహించారు. డీసీఎంఎస్ జిల్లా అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కాగా కర్నూలు ఎంపీ నాగరాజు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు నరహరి విశ్వనాథరెడ్డి, రాష్ట్ర టీడీపీ నాయకులు ఏవీఆర్ ప్రసాద్, ఎన్ఎండీ ఫిరోజ్, వీరభద్రగౌడ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ పార్టీలో చిన్నప్పటి నుంచి నేటి వరకు పనిచేస్తున్న నాగేశ్వరరావుయాదవ్‌ను పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పించిందన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచక పాలనతో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నామని, పార్టీ జెండాయే ముఖ్యమని ఎన్ని కేసులనైనా ఎదుర్కొని నిలిచిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ నాగేశ్వరరావుయాదవ్ ప్రతి ఒక్కరికీ సుపరిచితుడని, కష్టపడే మనస్తత్వంగల వ్యక్తి అన్నారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ శాశ్వత కరువు, వలసల నిర్మూలనకు కృషిచేయాలని, సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ప్రతి రైతుకు అండగా ఉంటానని అన్నాడు.

సంక్షేమ పథకాలకు ఎగనామం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఎగనామం పెడుతున్నదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500 ఇచ్చే సంక్షేమ పథకాలకు పూర్తిగా ఎగనామం పెట్టిందన్నారు. టీడీపీ నేతల అక్రమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎంపీ, మంత్రులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తుందన్నారు. వైసీపీ ఒత్తిడితోనే తల్లికి వందనం అమలు చేశారని అన్నారు. ఈ సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, నగర మేయర్ బీవై. రామయ్య. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎస్వీ. విజయమనోహరి, కోడుమూరు ఇన్‌చార్జి సతీష్ పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం

● మేనిఫెస్టో హామీలు అమలు

● ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఏడాది పాలనపై సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసం, అరాచక పాలనతో విసుగు చెందిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి 94 శాతం సీట్లతో అధికారం కట్ట బెట్టారన్నారు.తొలి ఏడాదిలోనే సంక్షేమం, రెట్టింపు పథకాలతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఓ పక్క ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మరో పక్క అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దుర్బుద్ధితో వైసీపీ నాయకులు బురదచల్లే నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు మానుకొని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు.

ఒకే ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం

● రూ.65వేలు తల్లి ఖాతాలో జమ

● సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ఐదుగురు పిల్లలతో తల్లిదండ్రులు

కోసిగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఒకే ఇంట్లో ఐదుగురు విద్యార్థులకు 'తల్లికి వందనం' డబ్బులు జమ అయ్యాయి. కోసిగిలోని 7వ వార్డుకు చెందిన బెళగల్ నరసమ్మ, ఈరేష్ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఐదుగురు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.13వేల ప్రకారం రూ.65వేలు తల్లి ఖాతాలో జమ అయ్యాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు బెలగల్ నరసమ్మ, వీరేష్ సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో శ్రీలత (7వ తరగతి) చదువుతుంది. స్థానిక జేబీఎం ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులైన గాయత్రీ (5వ తరగతి), అంజలి (4వ తరగతి), శాంతి (2వ తరగతి), నరసింహ (1వ తరగతి) చదువుతున్నారు. ఆదివారం డబ్బులు తమ ఖాతాలో జమ కావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి సమక్షంలో కాలనీవాసులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి క్షీరాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి రుణపడి ఉంటామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

వీఆర్వో పోస్టులు తగ్గించడం అన్యాయం

● ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మౌలిబాషా



మాట్లాడుతున్న వీఆర్వో సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రేషనలైజేషన్ పేరుతో వీఆర్వో పోస్టులు తగ్గించడం చాలా అన్యాయమని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మౌలి బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాత పద్ధతి ప్రకారం ప్రతి గ్రామానికి ఒక వీఆర్వోను కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంటు జారీ చేసిన జీవో.నెం.5తో సంబంధం లేకుండా గ్రేడ్-1 వీఆర్వోల బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో ఉన్న గ్రేడ్-2 వీఆర్వోల కోసం గ్రేడ్-1 వీఆర్వోల బదిలీలు ఆపడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సరాజు, కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షుడు బుద్ధకవి ఉన్నారు.

శ్రీమఠంకు రూ.4.50 లక్షలు విరాళం

మంత్రాలయం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి శ్రీమఠానికి ముంబైలోని థానే పట్టణానికి చెందిన ప్రశాంత్ కృష్ణాపూర్ అనేభక్తుడు అన్నదానంకు, దైనందిక సేవకు రూ.4.50లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. ఆదివారం విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, శ్రీపాద ఆచార్, దేశాయ్ నరసింహ ఆచార్‌లు పాల్గొన్నారు.

చదరంగంలో సత్తా..

● ప్రతిభ ముందు చిన్నబోయిన అంధత్వం

● ఉద్యోగం చేసుకుంటూనే చెస్ సాధన

● రైతు కుటుంబాల నుంచి వచ్చి అద్భుత ప్రతిభ

● ఫిడే రేటింగ్‌లో కూడా స్థానం

● రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు



టాప్ ఫిడేరేటింగ్ క్రీడాకారుల పోటీ

నంద్యాల హాస్పిటల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంధత్వం వారి ప్రతిభ ముందు చిన్నబోయింది. అందులైనా చదరంగంలో రాణిస్తున్నారు. అంతర్జాతీయ ఫిడే రేటింగ్‌లో రాష్ట్రానికి చెందిన అంధ క్రీడాకారులు టాప్-10లో ఉండటం విశేషం. సాధారణ రైతు కుటుంబం ఒకరిది. కూలీ పనితో జీవనం సాగిస్తూ పిల్లలను పోషించుకునే కుటుంబం మరొకరిది. చదరంగం పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ఫిడే రేటింగ్‌లో 1580, 1563, 1558, 1524 సాధించిన అంధ చెస్ క్రీడాకారులు నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలో అత్యుత్తమ పతకాలు సాధించారు. ఒక పక్క ఉద్యోగం చేసుకుంటూ మరోపక్క చదరంగం సాధన చేస్తూ అద్వితీయమైన ప్రతిభతో యువతకు ఆదర్శంగా నిలిచారు. శిక్షణఇస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి సిద్ధంగా ఉన్నామంటున్నారు. వీరంతా రాష్ట్ర, సౌత్‌జోన్, జాతీయస్థాయిలో పాల్గొని తమదైన ప్రతిభ కనబరుస్తూ దూసు కుపోతున్నారు. సామాన్యులతో పోటీపడుతూ చదరంగంలో సత్తా చాటడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్న ఫిడే రేటింగ్ అంధక్రీడాకారులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



తల్లిదండ్రులు సీత, వెంకటేశ్వర్లు. పొలం పనులు చేసుకుంటూ మమ్మల్ని చదివిస్తున్నారు. చిన్నప్పటినుంచి చెస్‌క్రీడపై ఆసక్తి. శివకోటేశ్వర రావు శిక్షణలో 2012లో టోర్నమెంట్‌లో పాల్గొన్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురంలో ద్వితీయ స్థానం. గుంటూరులో మూడో స్థానం. నరసరావుపేటలో పదోస్థానం, నంద్యాలలో 5వ స్థానం సాధించా. 2023లో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నా.

● ప్రసన్నకుమార్ (1558), ఈపూరి, పల్నాడుజిల్లా

టెక్నిక్‌లు తెలియకున్నా జాతీయస్థాయికి..



చెస్‌లో శిక్షణలేక ఇబ్బందులుపడుతున్నాం. జాతీయస్థాయి పోటీల్లో సరైన సమయంలో ప్రత్యర్థిని చిత్తుచేసే టెక్నిక్‌లు తెలియక జాతీయస్థాయికే పరిమితమవుతున్నాం. విశాఖపట్టణం జీవీఎంసీలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నా. 2004నుంచి చెస్ ఆడుతున్నా. 2018లో కేరళ, 2017లో చెన్నైలో సౌత్‌జోన్ చెస్‌పోటీల్లో పాల్గొన్నా. ఇద్దరు టాప్ ఫిడేరేటింగ్ క్రీడాకారులపై గెలిచా. శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా.

- కల్లా మురళి, విశాఖపట్టణం

అంతర్జాతీయ స్థాయిలో ఆడాలనుంది



చదరంగం క్రీడలో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆడాలనుంది. తల్లిదండ్రులు ప్రమీల, చెన్నకృష్ణారెడ్డి నన్ను ప్రోత్సహిస్తున్నారు. నాన్న లైన్‌మన్‌గా రిటైరయ్యారు. 2020లో ఆర్డీవో కార్యాలయంలో నాకు టైపిస్ట్ ఉద్యోగం వచ్చింది. 2023లో ఎల్‌ఐసీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగం రావడంతో టైపిస్ట్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎల్‌ఐసీలో కొనసాగుతున్నా. 2017నుంచి చెస్‌ఆడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు, నరసరావుపేట, ఏలూరులో పాల్గొన్నా. 2018లో అనంతపురంలో జరిగిన సౌత్‌జోన్ పోటీలో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికయ్యా. 2018లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయిలో పాల్గొన్నా.

- మనోరంజన్‌రెడ్డి (1524), కడప

వరల్డ్ చాంపియన్ గుకేశ్‌లా ఆడాలనుంది



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు నారాయణమ్మ, మునెప్ప. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాం. కుప్పం నియోజకవర్గం బిజిగానిపల్లె మా స్వగ్రామం. పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో ఎంఏ తెలుగు పూర్తిచేశా. తిరుపతిలో కెనెరాబ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నా. 2016నుంచి చెస్ ఆడుతున్నా. ఆరుసార్లు రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనగా మూడుసార్లు చాంపియన్‌గా నిలిచా. 2017చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ చెస్‌పోటీల్లో పాల్గొన్నా. జాతీయ స్థాయికి ఎంపికైనప్పటికీ ఆఫీస్‌లో సెలవు దొరక్క వెళ్లలేకపోయాను. ప్రస్తుత వరల్డ్ చాంపియన్ గుకేశ్‌లాగా ఆడాలని ఉంది.

- రఘురామ్ (1563), బిజిగానిపల్లి, కుప్పం



అంధుల కోసం ప్రత్యేక చెస్ బోర్డు

చిరుతల కలకలం

(5వ పేజీ తరువాయి)



కోసిగిలోని ఎర్రవంకలో సంచరిస్తున్న చిరుత

అనంతరం వారి సూచనల మేరకు తిరుపతి జూపార్క్‌లో గానీ, శ్రీశైలం నల్లమల అడవిలో గానీ వదులుతామని అటవీ అధికారులు చెప్పారు.

బసవన్న కొండపై మరో చిరుత



చిరుతని వల వేసి బంధిస్తున్న యువకులు

అలాగే మరో చిరుత బసవన్నకొండపై కూర్చుని చాలా సేపు తర్వాత కొండపైనే అటూ ఇటు తిరుగుతూ కొండలోకి వెళ్లిపోయింది. గత ఐదేళ్ల నుంచి కోసిగిలోని తిమ్మప్పకొండ, బసవన్న కొండ, రంగప్పగట్టులో చిరుత పులులు స్థావరం ఏర్పాటు చేసుకుని ప్రతి ఏటా చిరుతల సంఖ్య కోసిగిలో ఎక్కువ కావడంతో రైతులు, గొర్రెల కాపరులు పశువుల యజమానులు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా కోసిగి కొండల్లోని ఉన్న చిరుతలను ఫారెస్టు అధికారులు బంధించి అడవిలోని ఇతర ప్రాంతాలకు తరలించాలని కోసిగి ప్రజలు కోరుతున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సి. నారాయణరెడ్డి

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



సినారె వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సి. నారాయణ రెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచిపోతారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జ్ఞానపీఠం పురస్కార గ్రహీత, సినీ పాటల రచయిత డాక్టర్ సి. నారాయణ రెడ్డి 8వ వర్ధంతి సభ, సినారె పాటలపై సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తెలుగుచలన చిత్ర రంగంలో ఎన్నో మరపురాని పాటలు రాసిన సినారె ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో డాక్టర్ సినారె రాసిన పాటలను గాయకులు మహమ్మద్ మియా, కె. బాలవెంకటేశ్వర్లు, సుధారాణి, శ్రీనివాసులు, హబీబ్ ఆలపించారు.

పొలం విషయంలో ఘర్షణ

సి.బెళగల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన బార్కె నారాయణ కుమారులు రాముడు, రాజేష్‌లు గత మూడేళ్ల నుంచి పొలం విషయంతో తరచూ ఘర్షణ పడేవారు. ఆదివారం రాజేష్ అన్నదమ్ములు ఇద్దరు ఘర్షణ పడ్డారు ఘర్షణలో రాజేష్.. రాముడు చెవిని కొరికాడు. అతడి చెవి పూర్తిగా తెగిపడింది. వీరు గొడవ పడుతుండగా స్థానికులు వచ్చి సర్ది చెప్పారు. రాముడు అన్న రాజేష్‌పై ఫిర్యాదు చేశాడు. ఈమేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గోనెగండ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని పెద్దనేలటూరు గ్రామం వద్ద చోటుచేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని గంజిహళ్లికి చెందిన ప్రేమ్‌కుమార్(25) పత్తి పొలాల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పత్తి పొలంలో కూలీ పని కుదుర్చుకునేందుకు పొలం యజమానిని కలిసేందుకు స్నేహితుడు మోహన్‌తో కలిసి శనివారం రాత్రి బైక్‌పై పెద్దనేలటూరు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. పెద్దనేలటూరు శివారు దాటగానే మలుపు దగ్గర బైక్ అదుపుతప్పి కింద పడిపోయింది. ప్రేమ్‌కుమార్ తల రోడ్డు పక్కనే ఉన్న బండరాయికి తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. మోహన్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రేమ్‌కుమార్‌ను చికిత్స నిమి త్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చదివిన బడి రుణం తీర్చుకోవాలి

● ప్రస్తుతం విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు

● కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

● నందికొట్కూరులో ఐటీఐ, పాలిటెక్నికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



ప్రభుత్వ పాఠశాల మరమ్మతులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మన ఎదుగుదలకు కారణమైన పాఠశాల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. తాను చదువుకున్న పట్టణంలోని సుబ్బారావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నారు. అప్పట్లో విద్యార్థులకు ఫిజకల్ యాక్టివిటీకి దూరమయ్యారని అన్నారు. అనంతరం పాఠశాల విమరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రహరీ, పైకప్పు, పెయింటింగ్, మినరల్ వాటర్ ప్లాంట్ పనులకు రూ.13లక్షలు డిస్ట్రిక్ట్ జనరల్ ఫండ్ నుంచి కేటాయించారు.

త్వరలోనే సెంట్రల్ లైటింగ్ పనులకు శ్రీకారం

పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి జమ్మిచెట్టు వరకు సెంట్రల్ లైటింగ్ పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. నందికొట్కూరు డిగ్రీ కళాశాలలో ఐటీఐ, పాల్‌టెక్నికల్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కలెక్టర్ రంజిత్‌బాషను కోరారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మిత్రుడికి సన్మానాలు

తమతో పాటు చదువుకున్న కలెక్టర్ అయిన రంజిత్‌బాషా నందికొట్కూరుకు వస్తుండడంతో ఆయన మిత్రులు పాఠశాల వద్దకు తరలివచ్చారు. ఆయనను శాలువాలు, దండలతో సన్మానించారు.

కొవ్వొత్తులతో వైద్య విద్యార్థుల నివాళి



మృతి చెందిన మెడికోలకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జూడాలు

కర్నూలు హాస్పిటల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన బీజే వైద్యకళాశాల మెడికోలకు కర్నూలు మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ఏపీ జూడా సంఘం వర్కింగ్ ప్రెసిడెంటు డా. సీవీ సహాస్, వైస్ ప్రెసిడెంట్ డా. వీఎం హరి మాట్లాడుతూ అహ్మదాబాద్ బీజే మెడికల్ కాలేజీ హాస్పిటల్ భవనంలోకి విమానం దూసుకెళ్లిన ప్రమాదంలో ఐదుగురు మెడికోలు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏజీ జూడో సంఘం నాయకులు డా.హరూ న్ రషీద్, డా.కుమార్ రాజా, అడ్వైజరీ కమిటీ సభ్యులు డా.అనంత్ నాగ్, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



వెలుగోడులో కనువిందు చేస్తున్న ఇంద్రధనస్సు

వెలుగోడులో వరదగూడు

వెలుగోడు జూన్ 15 (ఆంధ్రజ్యోతి); వెలుగోడులో అదివారం సాయంకాలం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆ సమయంలో ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. వాన కురిసి వెలిసిన చల్లని వేళ హరివిల్లు అలరించింది. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.

చూస్తే అవాక్కవుతారు..!



ఆత్మకూరు బైపాస్ రోడ్డులో
అనవసరమైన చోట ఏర్పాటు చేసిన బస్టాండ్

నేషనల్ హైవే అధికారుల అలసత్వంతో ఊర్లకు వెళ్లే కిలోమీటర్ల వివరాలను అడ్డగోలుగా పొందుపరుస్తున్నారు. ప్రత్యేకించి ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి 110 కిలోమీటర్ల దూరం ఉండగా ఏకంగా 148 కిలోమీటర్ల దూరంతో నేమ్ బోర్డును ఏర్పాటుచేశారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు నేమ్ బోర్డులో శ్రీశైలానికి వెళ్లే కిలో మీటర్ల వివరాలు చూసి అవాక్కవుతున్నారు. అలాగే బస్టాప్‌ల ఏర్పాటు కూడా మొక్కుబడిగా నిర్మిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆత్మకూరు బైపాస్ రోడ్డులో అక్కడక్కడ బస్టాప్‌లను ఏర్పాటు చేశారు. అయితే కనీసం ఆ బస్టాప్ వద్దకు ప్రయాణికులు వెళ్లేందుకు ఆస్కారమే లేకుండా పోయింది. రహదారికి ఇరువైపుల పంట పొలాలు ఉండే ప్రదేశంలో అనవసరంగా బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. ఆ బస్టాప్ వద్దకు ఆత్మకూరుకు చెందిన ప్రయాణికులు వెళ్లాలంటే కనీసం రోడ్డు దాటేందుకు వీలు లేకుండా డివైడర్ ఉంటుంది. బస్టాండ్ వద్ద దిగే ప్రయాణికులు కూడా పట్టణంలోకి రావాలంటే కనీసం అక్కడ సర్వీసు



శ్రీశైలం నేమ్ బోర్డులో 110 కి.మీ.లకు బదులు
ఇలా 148 కి.మీ.లు అని తప్పుగా రాశారు

రోడ్డు, ఇతర రహదారుల సదుపాయం కూడా లేదు. నేషనల్ హైవే అధికారులు స్పందించి నేమ్ బోర్డుల్లో తప్పుగా రాసిన కిమీల వివరాలను మార్చడంతో పాటు అవసరమైన చోట్ల బస్టాప్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

● ఆత్మకూరు, ఆంధ్రజ్యోతి

ముమ్మరంగా కార్డన్ సెర్చ్


తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు చుట్టు పక్కల పలు గ్రామాల్లో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు అర్బన్ సీఐ రాము మాట్లాడుతూ పట్టణంతో పాటు మండలంలోని కురుకుంద, కరివేన, నల్లకాల్వ గ్రామాల్లో ఆదివారం తెల్లవారజాము నుంచే బృందాలు ఏర్పడి కార్డన్ సెర్చ్ చేపట్టామన్నారు. పలువురు అనుమానితులు, రౌడీషీటర్ల నివాసాల్లో తనిఖీచేయగా 10 బీరు బాటిళ్లు, 12 మద్యం సీసాలతో పాటు సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 12 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

'ఎత్తిపోతల' కోసం పోరాడతాం


కరపత్రాలను విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

మిడుతూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం వచ్చేవరకు పోరాడతామని సీపీఐ(ఎంఎల్), లిబరేషన్ ఎంసీపీఐయూ పార్టీ నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, లాజరస్ అన్నా రు. ఆదివారం మండలంలోని కడుమూరు గ్రామంలో వామపక్షాల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండలానికి ఎత్తిపోతల మంజూరు చేయాలని గ్రామంలో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 40 వేల ఎకరాల మెట్టభూమి ఉందని, రైతులు కేవలం వర్షాధారం మీద ఆధార పడి పంటలు పండిస్తున్నార న్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మండలానికి ఎత్తిపో తల పథకం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎత్తిపోతల కోసం ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మర్రిస్వామి, శీను, సోమ న్న, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం


విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు ఎస్ఎండీ గౌస్‌ఆజం పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఇస్లాంపేట ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్ కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకొని చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హుసేన్ సాహెబ్, యూనిట్ ఇన్‌చార్జ్ అన్సర్‌అలి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ రసూల్, చేపల మాబాషా ఉన్నారు.

గోవులను సంరక్షించాలి


మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గోవులను సంరక్షించాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కర్నూలు బసవరాజు అన్నారు. ఆదివారం హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నంద్యాల చెరువు కట్ట వినాయక ఘాట్ వద్ద గోసంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవు చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు కమతం సుదర్శన్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తాడి రామక్రిష్ణారెడ్డి, రాష్ట్రీయ ధర్మరక్షాదళ్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ఆర్‌డీ ఆర్‌డీ గోరక్షక్ జిల్లా ప్రముఖ్ రామ్‌చరణ్, ఉపాధ్యక్షులు శివ, ప్రతాప్, సతీష్, కళ్యాణ్ ఆచారి, గణేష్ కేంద్ర సమితి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఈకి తీవ్ర గాయాలు

మహానంది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానం ఇంజనీరింగ్ విభాగంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు యాదవ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం మహానందిలో విధులు నిర్వహించుకొని బైక్‌పై నంద్యాలకు తిరుగు ప్రయాణం అయ్యారు. నంద్యాల మండలం సుగాలిమెట్ట సమీపంలో బైక్‌ను వెనుక వైపు నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. బైక్ అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఏఈ శ్రీనివాసులును స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అంధుల చెస్ పోటీలు

నంద్యాల హాస్పిటల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీవనజ్యోతి ఇంక్లూజివ్ స్కూల్ ఆవరణలో రెండవ ఆలిండియా చెస్ ఫెడరేషన్ ఫర్ బ్లైండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంధుల రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. రామకృష్ణ పీజీ కళాశాల డైరెక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ సౌత్‌జోన్ జాతీయస్థాయి అంధుల క్రీడలు నిర్వహించేందుకు తాము సహకరిస్తామన్నారు. చీఫ్ ఆర్బిటర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో సకలాంగుల కంటే దివ్యాంగులు చక్కగా పాల్గొన్నారన్నారు. డా.రామకృష్ణారెడ్డి రూ.30వేల నగదు బహుమతి, సర్టిఫికెట్లు బహూకరించారన్నారు. పోటీల్లో ప్రథమస్థానం రఘురామ్, ద్వితీయ స్థానం పల్లా గణేష్, మూడో స్థానం మురళికి దక్కింది.


రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొన్న అంధులు


విజేతలతో అతిథులు

అండర్-19విభాగంలో అయిదుగురు బహుమతులు సాధించారన్నారు. మహిళా విభాగంలో ముగ్గురికి బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ నిర్వహణకు బీవీఎస్ అండ్ బీవీ చారిటబుల్ ట్రస్ట్, భవనాశి జ్యువెలర్స్ భోజన సదుపాయం కల్పించారు. టోర్నమెంట్‌లో ఇంటర్నేషనల్ చెస్ క్రీడలో టాప్‌టెన్ రేటింగ్ క్రీడాకారులు పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం షబానా, సుగుణావతి, పినిహాసరావు, వలి, తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాకు న్యాయం చేయని జగన్

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


అలగనూరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న
ఎమ్మెల్యేలు గిత్తా జయసూర్య, పుట్టా సుధాకర్ యాదవ్

మిడుతూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్ బాగుచేసి తాగునీరు ఇవ్వకుండా సొంత జిల్లాకడపకు అన్యాయం చేసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని అలగనూరు రిజర్వాయర్‌ను నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా జయసూర్య మాట్లాడుతూ గతంలో రిజర్వాయర్ కట్ట కుంగడంతో 2017లో టీడీపీ ప్రభుత్వం రూ.2.5 కోట్ల నిధులతో కట్ట మరమ్మతులు చేయడం మొదలు పెట్టిందన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కట్ట మరమ్మతులకు రూ.4 కోట్ల నిధులు మంజూరుచేసి మరమ్మతులు చేయకుండా మధ్య లోనే నిలిపివేసి రైతులకు, మత్యకారులకు జగన్మోహన్‌రెడ్డి అన్యాయం చేశారన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ అప్పట్లో రిజర్వాయర్‌కు రూ15 కోట్ల ఖర్చుపెట్టి వుంటే రైతులకు ఇంత నష్టం జరిగేది కాదన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి రిజర్వాయర్‌ను బాగు చేసేందుకు కృషిచేస్తామన్నారు. రిజర్వాయర్ మరమ్మతు కోసం రూ.36కోట్లకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మర్కెట్‌యార్డు చైర్మన్ వీరంప్రసాదరెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్, టీడీపీ మండల కన్వీనర్లు కాతా రమేష్ రెడ్డి, పలచాని మహేశ్వర రెడ్డి, నాయకులు రామస్వామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల్లో మానసిక స్థైర్యాన్ని నింపాలి

నంద్యాల క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వృద్ధులపట్ల ప్రేమ, గౌరవం, ఆదరణ చూపిస్తూ వారిలో మానసిక స్థైర్యాన్ని నింపాలని మూడో అదనపు జిల్లా న్యాయాధికారి, మండల లీగల్‌సెల్ చైర్మన్ అమ్మన్న రాజా అన్నారు. ప్రపంచ వృద్ధుల దౌర్జన్య నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం రైతునగర్‌లోని ప్రతిభా వృద్ధుల అనాథాశ్రమాన్ని న్యాయాధికారి అమ్మన్నరాజా సందర్శించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల పట్ల నిర్లక్ష్యం వీడాలని, వారిని శారీరక వేధింపులకు గురి చేయరాదన్నారు. ఆస్తి, డబ్బు అపహరణ కాకుండా కాపాడుకునేందుకు చట్టాలు ఉన్నాయని చెప్పారు. వృద్ధుల అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సమస్యలుంటే మండల లీగల్‌సెల్ ద్వారా ఉచితంగా న్యాయాన్ని అందజేస్తామని వృద్ధులకు సూచించారు.


మాట్లాడుతున్న న్యాయాధికారి అమ్మన్న రాజా

కార్యక్రమంలో మండల లీగల్‌సెల్ న్యాయవాది మద్దిలేటి, వృద్ధాశ్రమ నిర్వాహకుడు నారాయణ, వార్డెన్ లక్ష్మీదేవి, లోక్‌అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం


స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

గోస్పాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్నేహితుడికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మండలంలోని ఒంటివెలగల గ్రామానికి చెందిన విజయ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే తన పదోతరగతి (2004-2005బ్యాచ్)కి చెందిన మిత్ర బృందం రూ.53వేలు విజయ్ కుటుంబానికి అందజేశారు. ఆర్థిక సహాయం చేసినవారిలో సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, అంకన్న, ప్రసాద్, కాంతారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

మహానంది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఎం.తిమ్మాపురం జడ్పీ పాఠశాలలో 2011-12 లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 13 సంవత్సరాల తరువాత కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఏళ్ల తరువాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు.

నిస్వార్థ సేవకుడు మార్పు బాలకృష్ణమ్మ


బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి
నివాళి అర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా 12యేళ్ల పాటు పనిచేసిన నిస్వార్థ సేవకుడు, నిఖార్సయిన ఉపాధ్యాయ ఉద్యమ నేత మార్పు బాలకృష్ణమ్మ అని నంద్యాల జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు కొనియాడారు. ఆదివారం బాలకృష్ణమ్మ జయంతి సందర్భంగా నంద్యాలలో ఏపీటీఎఫ్ నాయకులు నగిరిశ్రీనివాసులు, మల్లెల పుల్లయ్య, గోపాల్‌రావు, జయరాంల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, విద్యాప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యంగా ఏపీటీఎఫ్‌ను స్థాపించి ఎన్నో పోరాటాలు చేసిన ఉద్యమ నేత అన్నారు. వారి ఆశయాలను కొనసాగించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామ్‌ప్రసాద్, నగిరి వెంకటేశ్వర్లు, ఖలీల్‌అహ్మద్, బాలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహానందీశ్వరుడి కల్యాణం

మహానంది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం ఘనంగా మహానందీశ్వరుడి కల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంత మంది భక్తులు కల్యాణం సేవా టికెట్టు కొనుగోలు చేసి కల్యాణ దాతలుగా వ్యవహరించారు. వేదపండితులు ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదిక మీద ఆశీనులను చేసి కల్యాణం జరిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు దైవదర్శనానికి వచ్చారు. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ. లక్షలాది ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అత్యవసరమైతే అంతే..!

- మూడేళ్లుగా కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ డిపార్ట్‌మెంట్ల ఊసేలేదు
- లివర్, హృద్రోగులకు తప్పని తిప్పలు
- గత్యంతరంలేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు
- ఆసుపత్రి స్థాయి పెరిగినా డిపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయలేని అధికారులు



నంద్యాల హాస్పిటల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన వైద్యశాలకు అత్యవసర పరిస్థితుల్లో వెళ్తే అంతే సంగతులు. ఎందుకంటే కీలకమైన విభాగాలు నేటికీ ఇక్కడ ఏర్పాటు చేయలేదు. నంద్యాల జిల్లా ఏర్పడిన నాటినుంచి నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి జీజీహెచ్‌గా స్థాయి పెంచారు. 2022లో జీజీహెచ్‌గా స్థాయి పెరిగినప్పటి నుంచి ఇంతవరకు జీజీహెచ్‌లో అంకాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ డిపార్ట్‌మెంట్లు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. జిల్లాలో క్యాన్సర్, లివర్, హృద్రోగులకు తిప్పలు తప్పడంలేదు. ఆస్పత్రిలో డిపార్ట్‌మెంట్ల ఏర్పాటుపై అధికారులు దృష్టిసారించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన సూపరింటెండెంట్లు జీజీహెచ్‌లో ఈ మూడు విభాగాల ఏర్పాటుకు కృషిచేయకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో జీజీహెచ్‌లో తాత్కాలిక వైద్యంచేసి చేతులు దులుపుకుంటున్నారు. పేరుకే ప్రభుత్వ సర్వజన వైద్యశాల అని వైద్యసేవలు మాత్రం అంతంతమాత్రమే ఉన్నాయని ప్రజలు, రోగులు ఆరోపిస్తున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో జీజీహెచ్‌కు వెళితే ఆ మూడు విభాగాల్లోని రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. అత్యవసర చికిత్స కోసం గత్యంతరంలేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. నిరుపేద రోగులు ప్రైవేట్‌లో చికిత్స చేయించుకోవాలంటే ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ విభాగాలు నంద్యాల జీజీహెచ్‌లో ఏర్పాటు చేసి నిరుపేదలకు వైద్యసేవలు అందించాలని సర్వత్రా కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

జీజీహెచ్‌లో అంకాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ డిపార్ట్‌మెంటకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అత్యవసర సమయాల్లో జనరల్ మెడిసిన్ వైద్యులు చికిత్స చేస్తున్నారు. తీవ్రతను బట్టి మెరుగైన వైద్యంకోసం కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నాం. జీజీహెచ్‌లో భవన సముదాయాల కొరత కూడా ఉంది.

– డా.మల్లేశ్వరి, సూపరింటెండెంట్, జీజీహెచ్ నంద్యాల

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆత్మకూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని శ్రీశైలం రహదారి సమీపంలో పొలంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ రాము ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచినట్లు చెప్పారు. అయితే శ్రీశైలం రస్తా సమీపంలో పంట పొలాల్లో ఓ చెట్టు కింద కొంత మంది పేకాట ఆడుతున్నట్లు గుర్తించామని అన్నారు. సంఘటనా స్థలానికి తాము చేరుకునేలోగా కొంత మంది పారిపోయే ప్రయత్నం చేశారు. మొత్తానికి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.17320 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఉపాధి హామీలో అవినీతిని అరికట్టాలి

నంద్యాల రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో అవినీతిని అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రతి పేదవాడికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు స్థలాన్ని ప్రభుత్వం ఇచ్చేంతవరకు ఉద్యమిస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక.. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రంగనాయుడు, సంజీవ్, సహాయ కార్యదర్శిగా ప్రతాప్‌తో పాటు మరో 22 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, ఆవుల శేఖర్, చేతివృత్తిదారుల సమైఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

మండలానికి 44 మంది ఉపాధ్యాయుల రాక

మహానంది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉమ్మడి జిల్లాల్లోని 44 మంది ఉపాధ్యాయులు బదిలీపై వస్తున్నట్లు ఎంఈవో రామసుబ్బయ్య ఆదివారం తెలిపారు. మరో రెండు రోజుల్లో బదిలీపై వచ్చే ఉపాధ్యాయులు విధుల్లో చేరుతారన్నారు.

భక్తుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం తన తల్లిదండ్రులు బీసీ లక్ష్మమ్మ, బీసీ గురెడ్డి జ్ఞాపకార్థం సొంత డబ్బుతో ప్రార్థనా మందిరాల్లో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఖాజీవాడా మసీదు, క్రిస్టియన్ బ్రదర్స్ అసెంబ్లీ చర్చి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ త్వరలో మరికొన్ని ప్రార్థనా మందిరాల్లో ఉచిత కూలింగ్ మినరల్‌వాటర్ ప్లాంట్లను ప్రారంబిస్తామన్నారు. ఇచ్చిన మాట మేరకు ఇప్పటి వరకు పట్టణంలో నాలుగు ప్రార్థనా మందిరాల్లో ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.6 లక్షలు సొంత నిధులు ఖర్చు పెట్టామన్నారు. తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని కోరారు. ఆయా ప్రార్థనా మందిరాల మతపెద్దలు ప్రార్థనలు చేసి బీసీ రాజారెడ్డిని ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లిం, క్రిస్టియన్ మతపెద్దలు పాల్గొన్నారు.

వృద్ధురాలి కళ్లు దానం
బేతంచెర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బందిక లక్ష్మీదేవి(75) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. మృతురాలి నేత్రాలను దానం చేస్తామని లైఫ్ యువనేత్ర సేవా సమితికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. అందుకు వారు అంగీకరించడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి సమాచారం ఇవ్వగా టెక్నీషియన్ శ్రీకాంత్ వృద్ధురాలి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు శ్రీనివాసులు, షేక్షావలి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి
డోన్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని మహాజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివన్న డిమాండ్ చేశారు. ఆదివారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డోన్ పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ప్యాపిలి, బేతంచెర్ల ప్రాంతాల్లోని పలు ప్రైవేటు పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేకున్నా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు అమలు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మహాజన స్టూడెంట్ ఫెడరేసన్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు
సంజామల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నొస్సం గ్రామంలో కొలువైన బుగ్గ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయాన్నే వేద పండితులు స్వామి, అమ్మవార్లను హంస వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. మహిళలు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి వసంతోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు గాధంశెట్టి రమణయ్య, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం
చాగలమర్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో ఆదివారం కమనీయంగా సాగింది కేపీ తండా గ్రామానికి చెందిన ఉభయదారులచే కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తుల పల్లకి ఉత్సవం వైభవంగా సాగింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేత నంద్యాల
ఆళ్లగడ్డ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గ్రేటర్ రాయలసీమ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. పోటీల్లో నంద్యాలకు చెందిన శివారెడ్డి జట్టు మొదటి బహుమతి రూ 15,000 కైవసం చేసుకుంది. అలాగే బనగానపల్లె, ప్రకాశం, అనంతపురం, ఆళ్లగడ్డకు చెందిన జట్లు వరుస బహుమతులు కైవసం చేసుకున్నాయి. పోటీలను తిలకించేందుకు క్రీడాకారులు తరలివచ్చారు. దాతలు శిల్పకళా మందిర్ బాలసుబ్రమణ్యం, సంజీవ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి ఆంజనేయులు, ప్రజ్ఞా విద్యా సంస్థలు, మహాసాయి శిల్పకళామందిర్, న్యాయవాది సుబ్బారెడ్డి బహుమతులు అందజేశారు.

ఫ్యాక్టరీ కార్మికులకు అండ: ఐఎన్‌టీయూసీ
బేతంచెర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటునగర్ గ్రామంలోని పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ముషరఫ్ ఫర్ ఖాద్రి అన్నారు. ఆదివారం మోకాళ్లపై కూర్చుని దీక్ష చేస్తున్న కార్మికులకు ఐఎన్‌టీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీఎస్‌ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, గ్రామ టీడీపీ నాయకులు వాసు, పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా ఉండాలి
బేతంచెర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమాజంలో అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడకుండా జీవించాలన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చాగలమర్రిలో మోస్తరు వర్షం
చాగలమర్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దాంతో మురుగు కాలువలు పొంగి ప్రవహించడంతో రహదారులు నీటి కుంటలుగా మారాయి. పశువైద్యశాల రహదారిలో రహదారి మురుగు కుంటను తలపించింది. కొద్దిపాటి వర్షానికే రహదారులు దుర్గంధంగా మారాయి. వర్షం కురవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న, మిరప, కంది తదితర పంటలకు ఊపిరి పోసింది.

రైతులు కలిసికట్టుగా ఉండాలి
- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి

ఆళ్లగడ్డ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు కలిసికట్టుగా ఉండి కిసాన్ సంఘ్ కార్యక్రమాలు నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక విశ్వశాంతి పాఠశాల ఆవరణంలో ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు గ్రామాల రైతులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ఆదివారం ముగిసింది. సమావేశంలో మహేష్‌రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో రైతులు వారి సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉండి పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం అంకాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు, జిల్లా కార్యదర్శి రాజంరెడ్డి భూపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉసేని, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ఆలయాలకు భద్రత ఏదీ?

- రెచ్చిపోతున్న దొంగలు
- హుండీలు, బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్తున్న దుండగులు
- పోలీసులకు సవాల్

శిరివెళ్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : దేవాలయాలను టార్గెట్‌గా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఆళ్లగడ్డ రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుట్టాలమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల దొంగతనానికి పాల్పడ్డారు. దాదాపు 20కేజీల వెండి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కొన్ని నెలల వ్యవ ధిలో ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాలోని పలు మండలాల్లోని దేవాలయాల్లో దుండగులు దొంగతనాలకు పాల్పడ్డారు. కొన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దుండగులు లెక్క చేయకుండా యథేచ్ఛగా హుండీలను, హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. దొంగలు గ్రామాల్లో పక్కాగా రెక్కీ నిర్వహించి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము సమయాల్లో దొంగతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దొంగతనాలు జరిగిన కొన్ని ఆలయాల్లోని సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు పోలీసులు చర్యలు తీసు కుంటున్నారు. జిల్లాలో జరుగుతున్న దొంగతనాలతో ఆలయాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి మండలంలో కొన్ని ప్రధాన దేవాలయాలు న్నాయి. భక్తులు సమర్పించే హుండీ కానుకలతోపాటు దేవతా మూర్తులకు అలంక రించే బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామంలోని ప్రధాన రహదారుల్లో, ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పో లీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దుండగులు ఆలయాల్లో చొరబడుతూనే ఉన్నారు. ఇటీవల పుట్టాలమ్మ ఆలయంలో భారీ దొంగతనం జరగడంతో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధాన ఆలయాల భద్రతను నేరుగా పరిశీలించి దేవదాయశాఖ అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.


దొంగలు ధ్వంసం చేసి వదిలి వెళ్లిన ఆలయ హుండీ


ఈ చిత్రంలో కనిపిస్తున్నది నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ముందు భాగంలో రహదారిపైనే ఉన్న స్వామివారి ఉపాలయం. ఇందులో దేవదాయశాఖ అధికారులు హుండీని సైతం ఏర్పాటు చేశారు. ఉపాలయానికి సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కోతుల బెడదతో తరచూ నిరుపయోగంగా మారుతున్నాయి. హుండీ దొంగతనానికి గురైతే నిందితుల ఆనవాళ్లు కూడా తెలుసుకునే వెసులుబాటు లేకుండా పోయే ప్రమాదం ఉంది.

ఇటీవల జరిగిన దొంగతనాలు
- శిరివెళ్ల నడిబొడ్డున, జనావాసాల మధ్య ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి (అమ్మవారి శాల) ఆలయంలో మార్చి 1న దొంగతనం జరిగింది. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అమ్మవారి శాలలోకి ప్రవేశించి హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలోని నగదును కాజేసి హుండీని ఊరి చివర ఉన్న ఓ వెంచర్‌లో వదిలేసి వెళ్లారు.
- శిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామంలోని రామాలయంలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు.
- రుద్రవరం మండలం ఆర్ నాగులవరంలోని నాగార్పమ్మ ఆలయంలో, నర్సాపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దొంగతనాలు జరిగాయి.
- రుద్రవరం మండల కేంద్రంలోని భాస్కర నందీశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి, అవధూత కాశిరెడ్డినాయన ఆలయాల్లో మార్చి 8న దొంగతనం చోటు చేసుకుంది. మార్చి 22న అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో రెండోసారి దొంగతనం జరిగింది.
- గోస్పాడు మండలం ఎస్ నాగులవరం గ్రామంలోని శివాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఫిబ్రవరి నెలలో చోటు చేసుకుంది.
- ఆళ్లగడ్డ రూరల్ పరిధిలోని పుట్టాలమ్మ ఆలయంలో ఈ నెల 11వ తేదీన దొంగతనం జరిగింది.

అనుమానిత వ్యక్తులపై నిఘా

గ్రామాల్లో అనుమానంగా సంచరించే వ్యక్తులపై నిఘా పెంచాం. ఆలయాల్లో జరిగిన దొంగతనాల్లో నిందితులను గుర్తించి సొమ్మును రికవరీ చేయడంతో పాటు రిమాండుకు తరలించాం. ప్రజల సహకారంతో అన్ని గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాం. గ్రామాల్లో రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేశాం.

- చిన్న పీరయ్య, ఎస్ఐ, శిరివెళ్ల

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి: మంత్రి
బనగాన పల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు, బాధితులు, కార్యకర్తలు, అధికారులు మంత్రి క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి సమస్యలను విన్నవించారు. ప్రజలు, బాధితుల వినతులు స్వీకరించి అప్పటికప్పుడే కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్‌లు చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అలాగే అధికారులు, ఉద్యోగులు అధికంగా మంత్రిని కలుసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా పొలం వివాదాలు, వ్యక్తిగత సమస్యలు మంత్రి దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు సేవలందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.


వినతులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

డీసీఎంఎస్ చైర్మన్‌కు అభినందనలు
డోన్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో మార్కెట్ యార్డులో ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా వై.నాగేశ్వరరావు యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.నాగేశ్వరరావును కలిసి ఎమ్మెల్యే కోట్ల అభినందనలు తెలిపారు. వై.నాగేశ్వరరావు ఎమ్మెల్యే కోట్లకు సత్కరించారు. ఆయన వెంట డోన్ టీడీపీ ముఖ్య నాయకులు ఉన్నారు. అలాగే రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొని వై.నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. సుబ్బారెడ్డి వెంట డోన్ టీడీపీ నాయకులు ఉన్నారు.

నంద్యాలకు తరలిన తెలుగు తమ్ముళ్లు

ప్యాపిలి: డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్ ప్రమాణస్వీకారానికి ఆదివారం మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు నంద్యాలకు భారీగా తరలి వెళ్లారు. చంద్రపల్లి, ప్యాపిలి, ఏనుగమర్రి, మెట్టుపల్లి, అలేబాదు, కలచట్ల, ఊటకొండ, వెంగళాంపల్లి, జలదుర్గం తదితర గ్రామాల నుంచి దాదాపు వంద వాహనాల్లో టీడీపీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రమాణస్వీకారానికి బయలుదేరారు.


నాగేశ్వర్‌రావుకు బొకేను అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, సుబ్బారెడ్డి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
- ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ/కోవెలకుంట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ హెచ్చరించారు. ఆదివారం తెల్లవారు జామున ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, శిరివెళ్ల, ఆళ్లగడ్డ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్ కంపమల గ్రామంలో బెల్ట్ షాపుల నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శిరివెళ్ల మండలం పెద్దకంబలూరులో సరైన పత్రాలు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలు, కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మలపెంటలో 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మూడు గ్రామాల్లో రౌడీషీటర్ల, అనుమానితులు, నేర చరిత్రగల వారి నివాసాలలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఆయా గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రమోద్

జీవితంలో యోగా భాగం కావాలి
- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్
- యోగా గురువు వేణుగోపాల్‌తో శిక్షణ

డోన్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీఎస్ పార్కులో ఆదోని నుంచి యోగా గురువు వేణుగోపాల్ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు రెండు రోజుల పాటు యోగా శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు యోగా శిక్షణను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకుని యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య, యోగా సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గంగ జాతర
ఉయ్యాలవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంజేడు, రూపనగుడి గ్రామాల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. ఉదయం నుంచి రెండు గ్రామాల్లో మేళ తాళాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించా రు. విచ్చేసిన భక్తులు, బంధువులు అందరూ కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి చీర, సారె పట్టువస్త్రాలు సమర్పించారు.


బోనాలతో వెళ్తున్న మహిళలు

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం
- రూ.4 లక్షల ఆస్తి నష్టం
- ఆదుకోవాలంటూ బాధితుల ఆవేదన

చాగలమర్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో ఆదివారం జ్యోతి, మహేంద్ర దంపతుల గుడిసె విద్యుదాఘాతంతో దగ్ధమైంది. దీంతో ద్విచక్రవాహనం, నగదు, బంగారు ఆభరణాలు, టీవీ, వంట సామగ్రి కాలిపోయి రూ.4 లక్షలు దాకా ఆస్తినష్టం సంబవించింది. కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో ఘోర ప్రమాదం తప్పింది. చుట్టుపక్కల ఉన్న వారు మంటలను అదుపు చేశారు. కట్టుబట్టలతో మిగిలామని చెంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధిత చెంచులు కోరారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు గోపాల్, బాబునాయుడు, కార్యకర్తలు బాధితులను పరామర్శించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా ఆదుకునేలా చూస్తామని అన్నారు.


చెంచుగూడెంలో కాలిపోయిన గుడిసె

నందవరంలో బర్రె మృతి

బనగానపల్లె: విద్యుదాఘాతంతో బర్రె మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం నందవరం గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామ సమీపంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర వేర్‌హౌస్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మానికి కంచె లేకపోవడంతో బర్రె తాకి మృతిచెందిందని బాధిత రైతు నాగసుబ్బారెడ్డి, సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. దీని విలువ సుమారు రూ.70వేలకు పైగా ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు తెలిపారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరుగకుండా కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.

18న మండల సర్వసభ్య సమావేశం
అవుకు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగన్న ఆదివారం తెలిపారు. సమావేశానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

సీపీఐలో పలువురి చేరిక
డోన్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం 30మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, కే.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పి. రామచంద్రయ్య మాట్లాడుతూ గతంలో సీపీఐ నుంచి సీపీఎంలోకి చేరి.. మరలా వీరు సొంత గూటికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. కలిసి కట్టుగా ప్రజల పక్షాన పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుంకయ్య, నారాయణ, మోటరాముడు, రాధాకృష్ణ, రోళ్లపాడు వెంకటేశ్, నాగరాజు, మధు, అక్బర్ ఉన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి
కొలిమిగుండ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న అభాగ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో అండగా నిలుస్తోందని తెలుగు యువత మండల అధ్యక్షుడు గొంగటి హుస్సేన్ రెడ్డి అన్నారు. ఆదివారం పెట్నీకోట గ్రామానికి చెందిన ఉప్పలూరు వెంకటశివారెడ్డి రూ.31,192, రామాంజనేయరెడ్డి రూ.21,084 మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. లబ్ధిదారులు మంత్రి బీసీకి, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గొంగటి నారాయణరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆకుల వెంకట శివారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఇటిక్యాలకు చెందిన పేరుమాళ్ల పక్కీరమ్మకు మంజూరైన సీఎం సహాయ నిధి (రూ.21,500) చెక్కును స్థానిక నాయకుడు తోట శివారెడ్డి అందజేశారు.

ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలి
కొలిమిగుండ్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అన్నదాతలు ఈకేవైసీని పూర్తి చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనున్నందున ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ పూర్తి కాకపోతే ప్రభుత్వ పథకాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం
డోన్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ ప్రజలకు రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టు పైపులైన్ ఈదుల దేవరబండ, బండగట్టు మధ్యలో పైపులైన్‌ల లీకేజీ వలన ఈ నెల 16, 17 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. మరలా ఈ నెల 18న ఉదయం నీటి సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు
రుద్రవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు
ఆళ్లగడ్డ జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని ఆచారి కాలనీలోని ఎస్‌ఆర్ శిక్షణా శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్ వేసవి శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. నిర్వాహకులు చంద్రకళ, యజ్ఞశ్రీ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్‌బాషా హాజరై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషపై నైపుణ్యాన్ని పెంచుకోవడం ముఖ్యమన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూర్ఛ రావడంతో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి
బేతంచెర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ రావడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఆర్.బుక్కాపురం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. కొమ్మూరు కొట్టాల గ్రామానికి చెందిన పుల్లారెడ్డి (68) ట్రాక్టర్ డ్రైవర్. అతడికి మూర్ఛవ్యాధి ఉన్నది. ఆర్.బుక్కాపురం గ్రామ సమీపంలో పనులు ముగించుకొని తిరిగి ట్రాక్టర్ నడుపుతూ వస్తుండగా గ్రామ సమీపంలో మూర్ఛ వచ్చింది. దాంతో ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన పలువురు ట్రాక్టర్ నుంచి బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

నీట్‌లో విద్యార్థి ప్రతిభ
బేతంచెర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామాంపురం గ్రామానికి చెందిన సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, రజిత దంపతుల కుమారుడు చిట్టి శేషనాథరెడ్డి నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచారు. నీట్‌లో 577మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 4900, స్టేట్‌లో 2300 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు శేషనాథ్‌రెడ్డిని అభినందించారు.